క్లుప్తంగా

ఆకట్టుకున్న హెల్దీ బేబీ పోటీలు



చిన్నారులతో తల్లులు

బీచ్ రోడ్డు: బోసి బుగ్గలు.. ముసిముసి నవ్వులు.. చిట్టి పొట్టి నడకతో చిన్నారులు మైమరిపించారు. వీరుమామ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్దీ బేబీ కాంటెస్ట్ ఆదరహో అనిపించింది. 120 మంది చిన్నారులు తమ తల్లిదండ్రులతో ర్యాంప్ వాక్ చేసి ఆదరగొట్టారు. ఈ పోటీల్లో చిన్నారుల కళ్లు, జుట్టు, నవ్వు, స్కిన్, చీక్స్ ఇలా వివిధ విభాగాల్లో 30 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎకో వైజాగ్‌కు సపోర్ట్ చేస్తూ క్లాత్ సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా హనీ రాయల్, స్వాతి, సుగుణ వ్యవహరించారు.

నోటి ఆరోగ్యంపై అవగాహన



ఫ్లాష్ మాబ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

బీచ్ రోడ్డు: నోటి ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించటంలో భాగంగా ఆదివారం గీతం దంత వైద్య కళాశాల విద్యార్థులు బీచ్ రోడ్డులోని వైఎంసీఏ వద్ద ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఆగస్టు 1న జాతీయ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు ప్రొఫెసర్ వై.రవిశంకర్ తెలిపారు. నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవటం వల్ల శరీరాన్ని చాలా రోగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చునని చెప్పారు. విద్యార్థులు ఉత్సాహంగా పలు పాటలకు నృత్యం చేసి సందర్శకులకు అవగాహన కల్పించారు.


'ప్రత్యామ్నాయం చూపితే బాగుండేది'



సీజీహెచ్‌ఎస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీ జీ.వి.ఎల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: చినవాల్తేరులోని సీజీహెచ్ ఎస్ వెల్ సెంటర్‌లో కొంత భాగం రోడ్డు విస్తరణలో భాగంగా జీవీఎంసీ తొలగించిన ప్రాంతాన్ని రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు ఆదివారం మధ్యాహ్నం పరిశీలించారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా జీవీఎంసీ అధికారులు కొంత భాగం తొలగించారని జీవీఎల్ పేర్కొన్నారు. రోడ్డు విస్తరణలో భవనాన్ని తొలగించే సమయంలో ప్రత్యామ్నాయం చూపించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై తాను జీవీఎంసీ అధికారులను వివరణ కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: నగరంలో అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని రౌడీషీటర్లను ద్వారకా జోన్ సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు రాత్రి 9 గంటలకు ఇంటి వద్ద ఉండాలని, మద్యం తాగి గొడవలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరు.. ఎక్కడ ఏం పనిచేస్తున్నారో వివరాలను తెలియజేయాలని చెప్పారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. ఎస్‌ఐ ధరేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా సుందరీకరణ పనులు



ఎలిమెంట్ భవన ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న మహిళలు



భవనం వద్ద ఫుట్‌పాత్ నిర్మాణం



రహదారి పక్కన చెట్లు, గోడలకు పెయింటింగ్ వేస్తున్న కార్మికులు

ఏయూ క్యాంపస్: వర్సిటీలో సుందరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఫార్మా ఇంక్యుబేషన్ భవనం ప్రారంభోత్సవానికి మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానుండడంతో అధికారులు వర్సిటీని ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే ఇంక్యుబేషన్ భవనం చుట్టూ లాన్‌లు, పెయింటింగ్ పనులు పూర్తి చేశారు. భవనానికి తుదిమెరుగులు దిద్దే పనుల్లో కార్మికులు ఉన్నారు. వర్సిటీకి తలమానికంగా, భవిష్యత్తులో వర్సిటీకి అతిపెద్ద ఆర్థిక వనరులను సృష్టించే కేంద్రంగా నిలిచే ఈ ఫార్మా ఇంక్యుబేషన్ భవనాన్ని దాదాపు 55వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించారు. భవనం చుట్టూ అందమైన లాన్‌లు, ప్రత్యేకమైన మొక్కలను నాటి ముస్తాబు చేశారు. భవనం చుట్టూ ఒక ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో నడక మార్గాలతో పాటు ఇతర వసతులను అభివృద్ధి చేశారు. ముఖ్యమంత్రి పర్యటన పురస్కరించుకుని సిరిపురం పెట్రోల్ బంక్ నుంచి ఎలిమెంట్ భవనం వరకు వచ్చే మార్గంలో వ్యర్థాలను తొలగించి, శుభ్రం చేశారు. రహదారిని ఆనుకుని ఉన్న గోడలకు పెయింటింగ్‌లు వేశారు. చెట్ల మొదళ్లకు సైతం రంగులు వేసి, తీర్చిదిద్దారు. భవనం బయట అవసరమైన ఫుట్‌పాత్‌ల నిర్మాణం, గేట్లు, గ్రిల్స్‌కి పెయింటింగ్ వంటి పనులను వర్సిటీ ఇంజినీరింగ్ అధికారులు, గార్డెనింగ్ విభాగం సిబ్బంది శరవేగంగా నిర్వహిస్తున్నారు. పనుల ప్రగతిని వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఎట్టకేలకు రోడ్డు విస్తరణ



గతంలో పల్లంగా ఉన్నప్పుడు సూర్యతేజానగర్ వద్ద రోడ్డుపై చేరిన వర్షపు నీరు



ఇటీవల నిర్మించిన రోడ్డు

ఆరిలోవ: చినగదిలి సాయిబాబా గుడి నుంచి సూర్యతేజానగర్ మీదుగా అంబేడ్కర్‌నగర్ వైపు జీవీఎంసీ ఇటీవల రోడ్డు విస్తరణ చేపట్టింది. ఇక్కడ గోతులు, పల్లంతో కూడిన ఇరుకు రోడ్డు.. విస్తరణతో రూపురేఖలు మారిపోయాయి. రోడ్డు పల్లం కావడంతో చిన్నపాటి వర్షానికి సైతం సూర్యతేజానగ్ వద్ద వరద నీరు చేరిపోయి నిలిచిపోయేది. ఆ నీటిలో వాహనచోదకులు రాకపోకలకు నానా అవస్థలు పడేవారు. ఇప్పుడు ఇక్కడ ఆ సమస్య తీరింది. ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులతో జీవీఎంసీ అధికారులు సుమారు రూ.2.35 కోట్లతో ఇక్కడ 20 అడుగుల రోడ్డును 80 అడుగులు వెడల్పుతో డబుల్ రోడ్డు నిర్మించారు. ఇందులో భాగంగా పల్లంగా ఉండి నీరు నిలిచే ప్రాంతాలను ఎత్తు చేశారు. కొన్ని దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ఈ సమస్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కారం లభించిందని స్థానికులు, వాహనచోదకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సందర్శించిన ఈడీ



సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అధికారులకు సూచనలిస్తున్న ఈడీ రవికుమార్

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆదివారం సాయంత్రం ఏపీఎస్ ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటిన్ డైరెక్టర్ సి.రవికుమార్ సందర్శించారు. బస్ స్టేషన్‌లో స్టాల్స్, పార్సిల్ పాయింట్‌ను తనిఖీ చేశారు. పార్సిల్ పాయింట్‌ను ప్రయాణికులు, వ్యాపారస్తులు, సింహాచలం పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పార్సిళ్లు జాగ్రత్తగా తీసుకు వెళ్లాలని డ్రైవర్లకు సూచించారు. అలాగే క్రాస్ రోడ్డులో పార్సిల్ పాయింట్ బుకింగ్ అండ్ డెలివరీకి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు, సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తులసి, కొండలరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు చేయించుకోవాలి

కలెక్టర్ మల్లికార్జున



మధురవాడ వసంత విహార్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మధురవాడ: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది రిక్షా కాలనీ, వసంత విహార్ అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఇంటింటా ఓటరు సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు డోరు టు డోర్ సర్వేపై అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఓటు నమోదు చేయించుకున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా నమోదు చేయించుకుని ఎన్నికల్లో భాగస్వాములు కావాలని కోరారు. సవరణలు కావాలనుకునే వారు ఫారమ్ 8లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు, చనిపోయిన వారి ఓట్లు విచారణ తర్వాత తొలగించాలని సిబ్బందికి చెప్పారు. ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుపై బూత్ లెవెల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. వారి పరిధిలో ఉన్న కాలేజీల్లో కూడా ఓటు హక్కులేని వారి వివరాలు నమోదు చేయించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. కుటుంబంలోని సభ్యుల ఓట్లన్నీ ఒకే పోలింగ్ బూత్‌లో నమోదయ్యేలా చూడాలని బీఎల్‌వోలు, అధికారులను ఆదేశించారు. అర్బన్ ప్రాంతంలో 1400, రూరల్‌లో 1200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం కొత్త బూత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని నియోజకవర్గాల్లో నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను బూత్‌లుగా వినియోగించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితాను అధికారులతోపాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పరిశీలించి మార్పులు ఉంటే తెలియజేయాలని కోరారు. అనంతరం ఇక్కడ వీధిలైట్లు, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరగా దానిపై కలెక్టర్ మల్లికార్జున సానుకూలంగా స్పందించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విశాఖ రూరల్ మండల తహసీల్దార్ సనపల రమణయ్య, ఏఈఆర్‌వో నరేంద్రనాథ్ రెడ్డి, సూపర్‌వైజర్ కల్యాణి, శ్రీహరి, మల్లేశ్వరరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

రచయిత విహారితో సాహితీ గోష్ఠి



రచయిత విహారి దంపతులను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: కవి, కథా రచయిత విహారితో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాహితీ గోష్ఠి జరిగింది. విశాఖ సాహితి సంస్థ అధ్యక్షులు ఆచార్య మలయవాసిని అధ్యక్షత వహించారు. రావిశాస్త్రి పురస్కారం అందుకోనున్న విహారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విహారి కథకుడిగా, విమర్శకుడిగా తెలుగు సాహిత్యానికి గొప్ప సేవలందించారని ప్రశంసించారు. సాహిత్య గోష్ఠిలో పలువురు అడిగిన ప్రశ్నలకు విహారి సమాధానాలు చెప్పారు. కథా రచనలో మెళకువలు, కథన శిల్పంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చారిత్రక, పౌరాణిక నవలలు రాయడంలో ఉండే ఇబ్బందులను విశ్లేషించారు. ఎవరు ఏ వాదంతో రాసిన మానవతా వాదం అన్నింటి కంటే గొప్పదని పేర్కొన్నారు. రచయిత సమాజ పోకడలను అర్థం చేసుకుని ప్రాచీన సాహిత్యాన్ని ఇప్పటి వాదాలతో పరిశీలించకూడదన్నారు. గ్రంథాలయ సంయుక్త కార్యదర్శి, రచయిత డి.వి. సూర్యారావు మాట్లాడుతూ సంప్రదాయ, అభ్యుదయ మార్గాలకు వారధిగా విహారిని అభివర్ణించారు. అనంతరం విహారి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు ద్విభాష్యం రాజేశ్వరరావు, ఆచార్య వెలమల సిమ్మన్న, జె.పి.శర్మ, కందాళ కనకమహాలక్ష్మి, శంకర్ నీలు, బులుసు సరోజిని, గ్రంథపాలకులు దుర్గారాణి పాల్గొన్నారు.

అలరించిన కోలాటం



కోలాటం నిర్వహిస్తున్న శ్రీవారి భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ ప్రాంగణంలో శ్రీవారి భక్తులు నిర్వహించిన కోలాటం భక్తులను ఎంతగానో అలరించింది. సెలవు దినం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

లలితా పీఠంలో ముగిసిన ప్రవచనాలు



ప్రవచిస్తున్న మాతా రమ్యానంద భారతి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో వారం రోజులుగా జరుగుతున్న శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. శ్రీశక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని చివరి రోజు ప్రవచనంలో భండాసురుని సంహారానికి లలితాదేవి అమ్మవారు చేసిన యుద్ధ ఘట్టాన్ని భక్తులకు కళ్లకు కట్టినట్టు వివరించారు. భండాసురుడు ప్రయోగించిన మహాసుర అస్త్రం, అమ్మవారి వేదశక్తిని నశింప జేసేలా ప్రయోగించిన సోమకాసుర అస్త్రం, హిరణ్యాక్ష అస్త్రం గురించి ప్రవచించారు. మత్స్య, కూర్మావతారాలతో ఈ అస్త్రాలను అమ్మవారు ఎదుర్కొన్న తీరును వివరించారు. లలితా పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ప్రవచన కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రైవేటీకరణతో భరోసా కరవు



899వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్మిక కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం భరోసా లేకుండా చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 899వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో ఆదివారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు కార్మిక వర్గం మొక్కవోని దీక్షతో నిరసన చేస్తున్న కేంద్ర ప్రభుత్వం చూసీచూడనట్టుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా అంతిమ విజయం కార్మికవర్గానిదేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని వెనక్కి తీసుకుని, పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఏయూ సమాచారం..

ఆశావాద దృక్పథంతో సాగాలి



పవన్‌కుమార్ మిశ్రాను సత్కరిస్తున్న రెక్టార్ ఆచార్య కె.సమత

ఏయూ క్యాంపస్: విద్యార్థులు ఆత్మవిశ్వాసం, ఆశావాద దృక్పథంతో అడుగేయాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సూచించారు. ఆదివారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆధ్యాత్మికత వ్యక్తిని ఉన్నతంగా, దృఢంగా ఎదగడానికి దోహదపడుతుందన్నారు. లివింగ్ హనుమాన్ పుస్తక రచయిత డాక్టర్ పవనకుమార్ మిశ్రా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక భావాలు, మేధస్సును కలిగి ఉంటూ కర్మయోగిగా మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, వేదాంత ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ ఎస్.సత్యనారాయణ, బిరేందర్ సింగ్ ఫరొత్యల్, బి.వి.కె.చైతన్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మిశ్రాను స్పిరిచ్యువల్ సైంటిస్ట్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా అభిషేక్ రచించిన లార్డ్ హనుమాన్–రామ్‌కుక్కురా పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.

ప్రకృతిలో ప్రతి మొక్కకు ఓ ప్రత్యేకత



మొక్కల ప్రత్యేకతలను వివరిస్తున్న డాక్టర్ ప్రకాష్

ఏయూ క్యాంపస్: ప్రకృతిలో మనం నిత్యం చూసే ప్రతి మొక్కకు ఓ ప్రత్యేకత ఉందని ఏయూ వృక్షశాస్త్ర విభాగ పరిశోధకుడు డాక్టర్ ప్రకాష్ అన్నారు. ఆదివారం ఉదయం విభాగంలో నిర్వహించిన మొక్కలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశీయంగా పెరిగే మొక్కలు, విదేశాల నుంచి తెచ్చి అభివృద్ధి చేసిన మొక్కలు, ఔషధ మొక్కలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విభాగంలో మ్యూజియంలో భద్రపరిచిన వివిధ మొక్కల ప్రత్యేకతలు, విశిష్టతలను ఆయన వివరించారు.

'కోలా'కు అభినందనలు



కోలా గురువులును అభినందిస్తున్న అల్లిపల్లి ఎల్లాజీ

దాబాగార్డెన్స్ : డీసీసీబీ చైర్మన్‌గా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమ సేవా సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లిపల్లి ఎల్లాజీ ఆదివారం సంఘ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. స్థానిక మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై కోలాతో చర్చించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పేర్ల ధనలక్ష్మి, ఎస్. శంకర్, ఎన్. చింటుకుమార్, పి. రాజు, ఎం. సత్తిరాజులు తదితరులు పాల్గొన్నారు.

గురిపెడితే.. తప్పకూడదు..



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ అధికారి

ఏయూ క్యాంపస్: దేశ రక్షణలో యువత అడుగిడాలి. భరతమాత రక్షణకు నడుంబిగించాలి. యువతీ యువకులు దేశ త్రివిధ దళాలలో చేరాలి. దీనికి తొలి అడుగుగా నేషనల్ కేడెట్ కార్ప్స్ నిలుస్తుంది. కళాశాల స్థాయిలో విద్యార్థులను ఎన్‌సీసీలో భాగస్వాములను చేస్తూ క్రమశిక్షణ, దేశభక్తి, యుద్ధ మెళకువలు నేర్పిస్తారు. దీనిలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఏయూ అవుట్‌గేట్ వద్ద ప్రతి ఆదివారం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలా ఈ ఆదివారం కూడా విద్యార్థులకు తుపాకీల వినియోగంపై ఎన్‌సీసీ అధికారులు అవగాహన కల్పించారు. విద్యార్థులకు నమూనా తుపాకులు అందించి ప్రత్యక్షంగా శిక్షణ ఇచ్చారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న చిన్నారులు

సీతమ్మధార: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ కె.శ్రీకాంత్ అన్నారు. విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆదివారం సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం ఆవరణలో యోగా పోటీలు నిర్వహించారు. వీటిని జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు ఎస్.వెంకటరమణతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

విజేతలు వీరే..

8 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసు వరకు సుమారు 400 మంది యోగా పోటీల్లో పాల్గొన్నారు.

- సబ్ జూనియర్స్ విభాగంలో జయశ్రీ ప్రథమ, తేజశ్రీ ద్వితీయ, మౌళిక తృతీయ స్థానాల్లో నిలిచారు.
- జూనియర్స్ విభాగంలో కె.వెంకట వైష్ణవి ప్రథమ, బి.వైష్ణవి ద్వితీయ, హర్షవర్ధనిశ్రీ తృతీయ స్థానాలు సాధించారు.
- సీనియర్స్ విభాగంలో ఎస్.వి.రమణ ఫస్ట్, ఎస్‌కే అబ్దుల్ ఖాదర్ సెకెండ్, డి.మహేశ్వరరావు థర్డ్ ప్లేస్‌లో నిలిచారు. పోటీల అనంతరం ఆయా విభాగాల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అతిథులు ప్రదానం చేశారు.

యూసీసీతో మహిళలకు సమాన హక్కులు

సీతంపేట: ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) దేశానికి చాలా అవసరమని, దీనిని స్వాగతిస్తున్నామని మానవ వికాస వేదిక అధ్యక్షుడు యు.సాంబశివరావు అన్నారు. ఉమ్మడి పౌర స్మృతిపై ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా వివిధ మతాల్లో ఉన్న ఆచారాలతో మహిళలను అణచివేయడం, వారి హక్కులకు భంగం కలిగించడం మనం చూస్తున్నామన్నారు. ఉమ్మడి పౌర స్మృతి ఉంటే ఈ సమస్యలు ఉండవని, నేడు మహిళల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోందన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశించినది లౌకికవాద ఉమ్మడి పౌర స్మృతి అని పేర్కొన్నారు. దీనికి మతాలతో సంబంధం ఉండదని, జీవితం లౌకికమైనదని. మహిళలందరికీ సమాన హక్కులు కల్పించడం అంబేడ్కర్ కోరుకున్న లౌకిక ఉమ్మడి పౌరస్మృతి ముఖ్య ఉద్దేశమని సాంబశివరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కొత్తపల్లి వెంకటరమణ, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.